ఆంధ్రజ్యోతి



పెద్దపల్లి

జిల్లా వార్తలు

గడువులోగా నర్సింగ్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలి

కళ్యాణ్‌నగర్, మే 23(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సెక్రడ్ హార్ట్ స్కూల్ పక్కన 5 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. రూ.26కోట్లతో అన్నీ హంగులతో నిర్మిస్తున్న ఈ కళాశాల ఏడాది క్రితం ప్రారంభమైంది. ప్రస్తుతం శారదానగర్‌లోని సింగరేణి భవనంలో కళాశాలను నిర్వహిస్తున్నారు. అనంతరం కలెక్టర్ శారదానగర్‌లోని నర్సింగ్ కళాశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించి సూచనలు చేశారు. కలెక్టర్ వెంట వైస్ ప్రిన్సిపాల్ ఉన్నారు.

ట్రాఫిక్ ఏసీపీగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



కోల్‌సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీగా సీహెచ్ శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్లా డీసీఆర్‌బీలో డీఎస్పీగా పని చేస్తున్న ఆయనకు రామగుండం పోస్టింగ్ ఇచ్చారు. శ్రీనివాస్ గతంలో పొత్కపల్లి, సుల్తానాబాద్, బసంత్‌నగర్, ధర్మారంలలో ఎస్ఐగా పని చేశారు. సీఐగా ముథోల్, హుజురాబాద్, ధర్మపురి, సీఐడీల్లో పని చేశారు. డీఎస్పీగా పదోన్నతి లభించిన తరువాత సిరిసిల్లాలో పని చేశారు. ట్రాఫిక్ సీఐలు, ఎస్ఐలు శుక్రవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పాలకుర్తి తహసీల్దార్‌గా సునీత



పాలకుర్తి, మే 23(ఆంధ్రజ్యోతి): పాలకుర్తి తహసీల్దార్‌గా జేరిపోతుల సునీత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన ముద్దమల్ల జ్యోతి డిప్యూటేషన్ పై మంచిర్యాల జిల్లా భీమారం బదిలీ కాగా, ఓదెల మండల కేంద్రంలో పనిచేసిన సునీతను పాలకుర్తి మండల కేంద్రానికి నియమించారు. సునీత మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసినందున పూర్తి అవగాహన ఉందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏవైన సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా కలవవచ్చన్నారు.



కార్పొరేషన్‌లో లెస్‌టెండర్లు

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీల్లో 41శాతం, రోడ్డు నిర్మాణాల్లో 34శాతం
- కొనుగోళ్ల టెండర్లలోనూ అదే తంతు...
- అనుకూలమైన ఇంజనీర్ల జోన్లలో దందా
- అంచనాల్లో ఒకరేటు.. బిల్లు రికార్డులో మరోరేటు...
- పనుల్లో నాణ్యత లేక అవస్థలు...

కోల్‌సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగర పాలక సంస్థకు లెస్ టెండర్లు ఇప్పుడు తలనొప్పిగా మారాయి. కాంట్రాక్టర్ల చర్యలు కార్పొరేషన్‌ను అభాసుపాలు చేస్తున్నాయి. అభివృద్ధి పనుల్లో కొందరు కాంట్రాక్టర్లు వ్యూహాత్మకంగా లెస్ టెండర్లు దాఖలు చేస్తున్నారు. సాధారణంగా అంచనాలపై 5 నుంచి 10శాతం తక్కువ రేట్లపై టెండర్లు దాఖలు అవుతాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీల్లో 30 నుంచి 41శాతం వరకు, రోడ్ల నిర్మాణాల్లో 15 నుంచి 34శాతం వరకు తక్కువ రేటుపై కాంట్రాక్టర్లు టెండర్లు వేస్తున్నారు. చివరికి కొనుగోళ్ల టెండర్లలోనూ అదే తంతు కొనసాగుతుంది. ఇటీవల రామగుండం నగర పాలక సంస్థలో ఈ తరహా 30 పనుల్లో భారీగా లెస్ టెండర్లు దాఖలయ్యాయి. సుమారు రూ.5కోట్ల పనుల్లో ఈ తరహా టెండర్లు దాఖలయ్యాయంటే పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు.

అనుకూలమైన జోన్లలోనే లెస్ టెండర్లు

నగరపాలక సంస్థలో తమకు అనుకూలమైన జోన్లలోనే కాంట్రాక్టర్లు భారీగా లెస్ టెండర్లు దాఖలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆయా జోన్‌లలో ఇంజనీర్లను బట్టి ఈ తరహా టెండర్లు దాఖలవుతున్నాయనే ప్రచారం ఉంది. అంచనాల సమయంలోనే ఆయా జోన్‌లలో అనుకూలమైన ఐటంలను అంచనాల్లో చేర్చడం, అందుకు అనుగుణంగా కాంట్రాక్టర్లు లెస్ టెండర్లు దాఖలు చేయడం పరిపాటి అయ్యిందనే ఆరోపణలు వస్తున్నాయి. పనులు అసంపూర్తిగా మిగిలిపోతుండగా కాంట్రాక్టర్లకు మాత్రం లెస్ టెండర్లలోను రికార్డుల్లో సర్దుబాటు జరుగుతుండడం కార్పొరేషన్‌లో బహిరంగ రహస్యమైంది.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీల్లో నాణ్యతకు తిలోదకాలు...

మున్సిపల్ కార్పొరేషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. కార్పొరేషన్ సర్టిపై చేసిన ఐఎస్ఐ పరిశ్రమలే కాకుండా ఇతర పరిశ్రమల్లోని నాసిరకం పైపులు తీసుకువచ్చి డ్రైనేజీ నిర్మాణాలు చేస్తున్నారు. ధర తక్కువ ఉన్న పైపులకు నాణ్యత లేకపోవడంతో కొన్ని రోజులకే పైపులు పగిలిపోతున్నాయి. చాంబర్ల నిర్మాణాల్లోనూ ఇదే విధానాన్ని మిగతా 8వ పేజీలో

డీవియేషన్‌లోనే గుట్టు..

లెస్ టెండర్లు దాఖలయ్యేందుకు డివియేషన్లు, సప్లిమెంటరీ ఐటంలు చేర్చడమే ప్రధాన కారణంగా తెలుస్తుంది. అంచనాల సమయంలో ఇంజనీర్లు సైట్ కండీషన్లు చూడకుండానే అంచనాలు రూపొందించడం, పనుల సమయంలో డివియేషన్లు చేర్చడం పరిపాటి అయ్యింది. 5శాతం డివియేషన్లకు అవకాశం ఉంటుంది. నగరపాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో నానా రకాల విధానాలలో ఈ డివియేషన్లు 25 నుంచి 30శాతానికి చేరుకున్నాయి. సప్లిమెంటరీ అగ్రిమెంట్లలో గూడుపుటాని జరుగుతుంది. టెండర్ షెడ్యూల్‌లో ఐటంలకు ఒక రేటు ఉంటే రికార్డు సమయంలో రేట్లు మారుతున్నాయి. కొత్త రేట్లను రికార్డుల్లో చేర్చుతున్నారు. దీంతో డివి యేషన్లు, సప్లిమెంటరీ ఐటం అగ్రిమెంట్ల పేర కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా బిల్లులు రికార్డు అవుతుండడంతో కాంట్రాక్టర్లు భారీగా లెస్ టెండర్లు దాఖలు చేస్తున్నారు. ముఖ్యంగా లాభసాటి ఐటంలు ఉన్న పనులు చేయడం, నష్టమయ్యే పనులను వదిలిపెడుతున్నారు. సీసీ రోడ్ల నిర్మాణాల్లో పీసీసీ వేసి సీసీ వేయకుండానే నిధులు అయిపోయాయంటూ పనులు నిలిపివేస్తున్నారు. అధికారులు కూడా అదే విధంగా రికార్డులు చేస్తున్నారు.

సాధారణ ప్రసవాలు పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం సింగరేణి మెడికల్ కళాశాలలో ప్రభుత్వాసుపత్రి వైద్యులు, అర్బన్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అధిక ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా గర్భిణీలను ప్రోత్సహించాలని, వారికి అవసరమైతే కౌన్సెలింగ్ నిర్వహించాలని, మొదటి కాన్పులో సిజేరియన్ వీలైనంత వరకు తగ్గించాలని కోరారు. గర్భిణీలు ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని, పూర్తి స్థాయిలో టీకాలు వేయాలని, ఆశా వర్కర్ల ద్వారా ఫాలో అప్ చేయాలని, నొప్పులు రాగానే సమీప ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం జరిగేలా చూడాలన్నారు. అంతర్గాం, పుట్నూరు, రామగుండం, గోదావరిఖని పరిసర ప్రాంతాల్లో ఆశావర్కర్ల ద్వారా జనరల్ ఆసుపత్రిలో ఉన్న వసతులను వివరించాలన్నారు. ప్రైవేట్ నర్సింగ్ హోంలకు వెళ్లి డబ్బులు వృథా చేసుకుంటున్నారని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రసవాలను ప్రోత్సహించే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో టీఫా స్కానింగ్ యంత్రం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. దీంతో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని, ప్రతీ నెల రామగుండం ప్రాంతంలో ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలపై విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. ప్రజలు పూర్తి స్థాయిలో వైద్యం వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, డీఎంహెచ్ఓ అన్నప్రసన్నకుమారి, ఆర్ఎంఓ రాజు, హెచ్ఓడీలు అరుణ, శ్రీదేవి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాట్లు పూర్తి చేయండి



ఎలిగేడు పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్‌ఝూ

ఎలిగేడు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడులో ఏర్పాటు చేయనున్న పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రారంభినున్న పోలీస్‌స్టేషన్ భవనాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తామని సమయం ఎప్పుడనే విషయాన్ని తెలియజేస్తామని తెలిపారు. భవనంలోని గదులు, చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పూర్తిస్థాయిలో లైట్లను ఏర్పాటుచేసి అవసరం ఉన్నచోట రంగులు వేసి శుభ్రంగా ఉంచాలన్నారు. భవన పరిసరాలను పరిశీలించారు. సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్, పీసీలు పవన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తాం

సుల్తానాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచివేయడానికి కృషి చేస్తామని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. శుక్రవారం రాత్రి సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్ కౌంటర్‌ను పరిశీలించారు. సీపీ మాట్లాడుతు ఫిర్యాదు చేయడానికి వచ్చే వారితో గౌరవంగా మాట్లాడాలని, త్వరితగతిన సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ పరిధిలోని 27 గ్రామాలు, మున్సిపాలిటీ గురించి ఎస్ఐ శ్రావణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రౌడీయిజాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేదీ లేదని, వరుసగా రౌడీయిజానికి పాల్పడేవారిపై రౌడీషీట్ తెరువాలని ఆదేశించారు. రైస్‌మిల్లుల్లో పని చేసే ఇతర రాష్ట్రాల వారి పూర్తి సమాచారం సేకరించాలని, నేరస్తుల పై నిఘా ఉంచాలన్నారు. రైల్వేలైన్, జాతీయ రహదారిలపై జరిగే ప్రమాదాల గురించి అప్రమత్తంగా ఉండాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లతో సింగిల్ విండోల బలోపేతం



సహకార బ్యాంక్ భవనాన్ని ప్రారంభిస్తున్న కేడీసీసీబీ జిల్లా అధ్యక్షుడు కొండూరి రవీందర్ రావు, ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లతోనే సింగిల్ విండోలు బలోపేతమయ్యాయని, ఆ అవకాశాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. రెండున్నర కోట్ల రూపాయలతో నిర్మించిన కేడీసీసీబీ సుల్తానాబాద్ బ్రాంచి భవన సముదాయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే, కేడీసీసీబీ జిల్లా అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతు 2012 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉన్న శ్రీధర్ బాబు సహకార సంఘాలకు ధాన్యం కొనుగోళ్ల బాధ్యతలను అప్పగించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు ప్రతీ గ్రామంలో ఏర్పాటయ్యే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఎలాంటి కటింగ్‌లు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు.

- సింగిల్ విండోలకు సోలార్ యూనిట్లు

జిల్లా సహకార సంఘాలకు ప్రభుత్వం సోలార్ యూనిట్లను మంజూరు చేయడం సంతోషకరమని కేడీసీసీబీ జిల్లా అధ్యక్షుడు కొండూరి రవీందర్ రావు అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రెండు యూనిట్లు, రామగుండం, మంథని నియోజకవర్గాలలో ఒకటి చొప్పున సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తామన్నారు. విద్యుత్ ఉత్పత్తితో ఆయా సింగిల్ విండోలు ఆర్థికంగా పురోగతి సాధిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ ఛైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు, కేడీసీసీబీ ఉపాధ్యక్షుడు పింగళి రమేష్, సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సీఈఓ సత్యనారాయణ రావు, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల, డీజీఎం బ్రహ్మానందరావు, ఏజీఎం మహేష్, సాగర్ రెడ్డి, మేనేజర్ శశిధర్ రావు, కమిషనర్ నియాజ్, సొసైటీ సీఈఓలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

పెద్దపల్లి కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ శిబిరాలలో కరీంనగర్ ఉపాధ్యాయఎమ్మెల్సీ మల్క కొమురయ్య శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులలో నైపుణ్య అభివృద్ధి పెంపొందించేలా, విద్యార్థులు అన్ని రంగాలలో రాణించేలా బోధనాభ్యాస ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే బోధనాభ్యాసన ప్రక్రియలు, విద్యార్థుల అభివృద్ధి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు కొమురయ్యను సన్మానించారు. డీఈవో మాధవి, ఎంఈవో సురేందర్ కుమార్, డిసిబి సెక్రటరీ హన్మంతు, సెక్టోరల్ అధికారులు పిఎంషేక్, ప్రధానోపాధ్యాయురాలు అరుణ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశ నుంచే విద్యార్థులను అన్ని రంగాలలో రాణించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ సందర్శించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా పిల్లలను ఆలోచింప చేసే విధంగా బోధనలు ఉండాలన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆరెపల్లి రాజయ్య ఎమ్మెల్సీని సన్మానించారు.

రోహిణికి ముందే వర్షాలు..

- జిల్లాలో 35.2 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు
- రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- వర్షాలతో ఉక్కపోత నుంచి ఉపశమనం
- సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రోహిణికి ముందే వరుణుడు పలకరించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగుకు సన్నద్ధం అవుతున్నారు. వేసవి దుక్కులు దున్నుతూ విత్తనాల కోసం పరుగులు తీస్తున్నారు. రెండు రోజులుగా అరేబియా సముద్రంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు అక్కడక్కడ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవగా, ధాన్యాన్ని విక్రయించుకున్న రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. శుక్రవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 35.2 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. పాలకుర్తి మండలంలో అత్యధికంగా 50.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సుల్తానాబాద్ మండలంలో 50.2 మిల్లీమీటర్లు, అంతర్గాం 49.0, పెద్దపల్లి 41.5, మంథని 41.1, రామగిరి 38.9 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. రామగుండం మండలంలో 35.7 మిల్లీమీటర్లు, ముత్తారం 35.8, ఎలిగేడు 32.5, కమాన్‌పూర్ 32.0, ధర్మారం 31.4, జూలపల్లి మండలంలో 25.4, కాల్వశ్రీరాంపూర్ 15.3, ఓదెల మండలంలో 13.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

జిల్లాలో 2,72,678 ఎకరాల్లో సాగు

వచ్చే వానాకాలం సీజన్‌లో జిల్లాలో 2,72,678 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేయనున్నారని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. ఇందులో 2,12,500 ఎకరాల్లో వరి, 52,500 ఎకరాల్లో పత్తి, మిగతా మొక్కజొన్న, మిర్చి, ఆయిల్ పామ్ పంటలను సాగు చేయనున్నారు. సాధారణంగా యేటా జూన్ రెండో వారం మృగశిర కార్తె, ఆ తర్వాత కార్తెల్లో వరినార్లు పోస్తున్నారు. జూన్‌లో వర్షాలు పడిన తర్వాత ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. వరి సాగు ఆలస్యం వల్ల కోతలు ఆలస్యంగా వస్తున్నాయి. అకాల వర్షాలు, భారీ వర్షాలకు తీరని నష్టం వాటిల్లుతున్నది. దీంతో ఈ ఏడాది సకాలంలో సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. వానాకాలం సీజన్ ఈనెల 25 రోహిణి కార్తె నుంచి ఆరంభం అవుతుంది. ఈసారి రోహిణికి ముందే జిల్లాలోవర్షాలు కురవడంతో రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు.

సన్నరకం వరి పండించే రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నది. దీంతో గత ఏడాది ఇదే సీజన్‌లో రైతులు జిల్లాలో 68 శాతం సన్న రకం వరి పంటను సాగు చేశారు. ప్రభుత్వం రైతులకు 104 కోట్ల రూపాయల బోనస్ చెల్లించింది. ఈ సీజన్‌లో కూడా రైతులు సన్నరకం వరి పంటనే సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే సన్న రకం వరి విత్తనాలను సేకరించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వ్యవసాయ శాఖ రైతులకు అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేసింది. సాగు భూముల్లో భూసారం పెంచేందుకు కావాల్సిన సబ్సిడీపై జీలుగ విత్తనాలను సరఫరా చేస్తున్నారు. నకిలీ విత్తనాల విక్రయాలు జరపకుండా ఉండేందుకు జిల్లా స్థాయిలో అధికార యంత్రాంగం టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసింది. జిల్లాలో ముందస్తుగానే వర్షాలు పడడంతో ఎండల తీవ్రత, ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం కలగగా, రైతులు ముందుస్తుగానే సాగు చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.



అన్నదాతల పడిగాపులు

- కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలు
- తూకంవేసి మిల్లుకు తరలే వరకు రైతు బాధ్యత
- రోజులకు రోజులు అక్కడే నిరీక్షణ
- అకాల వర్షాలతో తడుస్తున్న ధాన్యం

పెద్దపల్లిటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవుతోంది. ప్రకృతి వైపరీత్యాలు యేటా అన్నదాతను నష్టాల పాలు చేస్తోంది. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడంతో రైతులు నష్టాలకు గురవుతున్నారు. దుక్కులు దున్ని పంట దిగుబడిని అమ్ము కొని రవాణా చేసే వరకు ఇబ్బందులు పడుతున్నాడు.

పంటలు కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే తేమ శాతం (మాయిచ్‌రైజర్) పేరుతో నాలుగైదు వారాలపాటు కాంటాలు వేయడం లేదు. పండించిన పంటతోనే కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యానికి కాపలా ఉండాల్సి వస్తోంది. అక్కడే తిండి, నిద్రతో కాలం గడుపుతున్నారు. ఒక వేళ తేమ 17 శాతం లోపు ఉన్నా బారదాన్ లేదనే సాకుతో ధాన్యం కాంటా వేయడం లేదు. దీనికి తోడు హమాలీల కొరతతో తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితుల్లో అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతోంది. ధాన్యంపై టార్పాలిన్లు కప్పినా వరద నీరు కింది భాగం తడిసి దుర్వాసన వస్తోంది. వరద తాకిడి లేకుండా ఫ్లాట్‌ఫాంలు కొంత మేర ఎత్తుగా నిర్మిస్తే కింది భాగం ధాన్యం తడిసి పోకుండా ఉంటుంది.

ఇప్పటికి మార్కెట్లో 25 రోజుల క్రితం తీసుకువచ్చిన ధాన్యం కాంటా వేయడం లేదు. తేమ శాతం సరిగా ఉండి కాంటా వేసి బస్తాల్లో నింపిన తరువాత లారీల కొరత ఎదురవుతోంది. దీంతో ఎటు దిరిగి రైతు మార్కెట్లోనే ఉండాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చినప్పటి నుంచి కాంటా అయి బస్తాల్లో నింపి, లారీల్లో లోడ్ చేసే వరకు రైతుదే బాధ్యత ఉంటుంది. ఈ విధానంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రతీ సీజన్‌లో అకాల వర్షాలు వెంబడిస్తున్నప్పటికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కేవలం రైతు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురాగానే తేమ శాతం చూసి కాంటా వేసి నాణ్యతను బట్టి ధర కేటాయించి టోకెన్ ఇచ్చి పంపించాలి. మిగితా పనులు హమాలీలు లేదా ఇతర సిబ్బందితో మిల్లులకు పంపించే ఏర్పాటు చేయాలి.

- అన్ని ఏర్పాట్లు చేయాలి

కొనుగోలు కేంద్రాల్లో సరిపడా కవర్లు, సంచులు అందుబాటులో ఉంచాలి, వెంటనే కాంటాలు వేసి లోడ్ చేసేందుకు హమాలీలను సిద్ధంగా ఉంచాలి, అలాగే మిల్లులకు తరలించేందుకు లారీలను సరిపడా ఉండాలి. దీంతో వెంట వెంట కొనుగోళ్ళు జరిగేందుకు అవకాశాలుంటాయి,

ధాన్యం తీసకువచ్చి 25 రోజులైంది

మద్దుల వేణు రంగంపల్లి



తేమ శాతం ఎక్కువగా ఉందని కొద్ది రోజులు, సంచులు లేవని మరి కొన్ని రోజులు చేశారు. ఇప్పటి వరకు ధాన్యం కాంటా కాలేదు. ఇప్పుడు పడుతున్న వానలతో ధాన్యం ఆరబెట్టలేక ఇబ్బంది పడుతున్నాం.

కవర్లు ఇచ్చిన వడ్లు తడుస్తున్నాయి

అర్కుటి రాజ్‌కుమార్

వాన కురిసినప్పుడు టార్పాలిన్లు కప్పినా ధాన్యం కింది భాగం తడుస్తోంది. వరదలో ధాన్యం కొట్టుకు పోతోంది. తడిసిన ధాన్యం వాసన వస్తోంది.



పురుగుల మందు తాగి వృద్ధురాలి బలవన్మరణం


వెంకవ్వ (ఫైల్)

గన్నేరువరం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన న్యాలపట్ల వెంకవ్వ(80) అనారోగ్యం బారినపడి మనస్థాపంతో శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. వెంకవ్వ కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై మతిస్థిమితం కోల్పోయింది. ఈ క్రమంలో శుక్రవారం ఇంటిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉండగా భర్త గతంలోనే మృతిచెందాడు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

ఓదెల, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపరపల్లిలో గుంపుల కొమురమ్మ (75) అనే వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకొంది. శుక్రవారం ఉదయం నుంచి వృద్ధురాలు కనబడకపోవడంతో గోపరపల్లి సమీపంలోని బావుల్లో వెతకగా మృతదేహం బయటపడింది. కొన్నేళ్ళుగా వృద్ధురాలు పక్షవాతంతో బాధపడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

మల్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): మల్యాల ఒడ్డెర కాలనీకి చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోదాసు శంకర్(37) అనేవ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పు రాడ్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యులు అందుబాటులో లేకపోవడంతో మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో రైతు చేగంటి పోచయ్య(58) అప్పుల బాధ భరించలేక తన వ్యవసాయ పొలం వద్ద ఉరేసుకొని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచయ్య తన రెండెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇద్దరు కుమారుల్లో పెద్ద కొడుకు కొమురయ్య పెళ్లి చేసుకొని అత్తగారింటి దగ్గర నివసిస్తున్నాడు. చిన్న కొడుకు రాకేష్ ఆర్థిక ఇబ్బందులతో గల్ఫ్ బాట పట్టాడు. కొడుకును విదేశాలకు పంపేందుకు, పంట పెట్టుబడి కోసం సుమారు రూ.6లక్షల వరకు అప్పులయ్యాయి. వేసిన పంటకు సరిగా దిగుబడి రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక మనస్తాపం చెంది పంట చేను వద్ద రేకుల షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ దుకాణాల సముదాయం వద్ద బుధవారం వర్షానికి తడిసి అచేతన స్థితిలో పడివున్న గుర్తు తెలియని వ్యక్తిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, తెల్లని గీత బ్లూ కలర్ రౌండ్ టీషర్ట్, బ్లాక్ కలర్ పాయింట్, ఎడమ చెవికి పోగు, బెల్ట్ ధరించి ఉన్నట్లు ఎస్సై లక్ష్మన్‌రావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులు సెల్ నంబర్లు 8712656506, 8712656507 సంప్రదించగలరని సూచించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన పెద్దపల్లి మండలంలోని నిట్టూరులో చోటు చేసుకుంది. నిట్టూరు గ్రామానికి చెందిన ముక్కెర సాయికుమార్ (24) వ్యవసాయ పనులు చేస్తున్నాడు. కొన్నిరోజులుగా పనికి వెళ్ళకుండా ఖాళీగా ఉండడంతో పనికి వెళ్లమని తల్లి మందలించగా ఈ నెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి కరీంనగర్ వెళ్ళాలని సూచించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు శుక్రవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తల్లి ముక్కెర వసంత ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మన్ రావు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న మినీ బస్సు

● చికిత్స పొందుతూ యువకుడు మృతి

తిమ్మాపూర్/మానకొండూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని శంషాబాద్‌కు చెందిన బాకారపు సురేష్(30) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. మానకొండూర్ సీఐ సంజీవ్ కథనం ప్రకారం.. శంషాబాద్ గ్రామానికి చెందిన సురేష్, మాజీసర్పంచ్ డొల్ల రమేష్ కలిసి ద్విచక్రవాహనంపై శంషాబాద్ స్టేజీ వద్ద రోడ్డు దాటుతున్నారు. ఈక్రమంలో ఎదురుగా వచ్చిన మిని బస్సు వారిని ఢీ కొంది. ఈప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సురేష్ తలకు బలమైనా గాయాలు కావడంతో కరీంనగర్ అసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైదారాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డే కేర్ సెంటర్లపై వృద్ధుల ఆశలు



● వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వ యోచన
● రాష్ట్రంలో 37 సెంటర్ల ఏర్పాటుకు కసరత్తు
● ఒక్కో సెంటర్‌లో 50 మందికి సదుపాయాలు
● నెలకు రూ.90 వేల బడ్జెట్ కేటాయింపు

జగిత్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఒంటరిగా ఉంటున్న వారి కోసం ఆ భావనను పోగొట్టడానికి ప్రభుత్వం ప్రతీ జిల్లాలో డే కేర్ సెం టర్లను ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారిత శాఖ ద్వారా రాష్ట్రంలో 37 మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంబంధిత ఫైల్ పై సంతకం చేసి సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం కోసం పంపినట్లు తెలుస్తోంది. సీఎం గ్రీన్‌సిగ్నల్‌తో రాష్ట్రంలోని జిల్లాల్లో ఒక్కోటి చొప్పున డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

ప్రతీ నెల రూ.4.61 కోట్ల ఖర్చు

కుటుంబ సభ్యులంతా ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఒంటరితనంతో బాధపడుతున్న వృద్ధుల సౌకర్యార్థం ఈ డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, హన్మకొండ, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రెండేసి చొప్పున, మిగతా 29 జిల్లాల్లో ఒకటి చొప్పున మొత్తం 37 సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. అటల్ వయో అభ్యుదయ యోజన నిబంధనల మేరకు ఏర్పాటు చేయనున్న డే కేర్ సెంటర్ల నిర్వహణను వయోవృద్ధుల సంక్షేమ శాఖకు అప్పగించనున్నారు. వీటి నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల 4.61 కోట్ల రూపాయలను ఖర్చు చేయనున్నారు. ఒక్కో సెంటర్ నిర్వహణకు నెలకు రూ.90 వేలు బడ్జెట్ కేటాయించనున్నారు.

సకల సదుపాయాలు

ఒక్కో డే కేర్ సెంటర్‌లో 50 మందికి సదుపాయాలు ఉంటాయి. ఇందులో కిచెన్, వైద్యుల గది, విశాలమైన హాల్, క్యారమ్స్, టెన్నిస్, చెస్ వంటి ఆట వస్తువులతో పాటు లైబ్రరీ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. డే కేర్ సెంటర్‌లో ఇండోర్ గేమ్స్, యోగా, పుస్తకాలు, కథలు, ధ్యానం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ వారం వైద్యులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను కూడా ఉచితంగా ఇస్తారు. డే కేర్ సెంటర్లకు వచ్చే వృద్ధులకు రాగి జావ, పండ్ల రసాలు, ఉప్మా, టీ, బిస్కెట్‌లు అందించేలా ప్రణాళికలు రూపొందించారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు..

బోనగిరి నరేశ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, జగిత్యాల



వృద్ధుల సంక్షేమానికి డే కేర్ సెంటర్ల ఏర్పాటు వ్యవహారం ప్రభుత్వ నిర్ణయం మేరకు జరుగుతోంది. ప్రస్తుతం ఇందుకు అవసరమైన కసరత్తులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పూర్తి స్థాయిలో నిర్ణయం తీసుకున్న తర్వాత విడుదల చేసే మార్గదర్శకాల ప్రకారం డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాం.

పోలీసుల అదుపులో మావోయిస్టు సానుభూతిపరుడు?

జగిత్యాలరూరల్, మే 23 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాలరూరల్ మండలం పొలాస శివారులో మూడురోజుల క్రితం మావోయిస్టు సానుభూతిపరుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, అతని నుంచి జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారని విశ్వసనీయ సమాచారం. జగిత్యాల మండలం ధరూర్‌లో 40ఏళ్లుగా నివాసం ఉంటున్న వ్యక్తి బండ రాళ్లకు డ్రిల్లింగ్‌వేసి జిలెటిన్‌స్టిక్స్‌తో ఉపాధి పొందున్నట్లు, ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనుమానితుడికి మావోయిస్టులపై ఉన్న సంబంధాలపై పోలీసు అధికారులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్‌ను వివరణ కోరగా ఇది పూర్తిగా అవాస్తవమని ఖండించారు.

దొంగ అరెస్ట్



దొంగను అరెస్ట్ చూపిస్తున్న సీఐ కె కృష్ణ

సిరిసిల్ల క్రైం, మే 23(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఆధారంగా చోరీకి పాల్పడిన కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన వేల్పుల రాజేశ్వర్‌రెడ్డి(31) అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేశామని సిరిసిల్లటౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. నిందితుడివద్ద 48.47గ్రాముల బంగారు అభరణాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. బోయిన్‌పల్లి మండలంలోని జగ్గారావుపల్లి గ్రామానికి చెందిన కొమురయ్య అనే వ్యక్తి తనభార్యతో కలిసి సిద్దిపేటలో ఉన్న తన బంధువుల పెళ్లికి వెళ్తుండగా సిరిసిల్ల బస్టాండ్‌లో తన భార్య హాండ్‌బ్యాగులో నుంచి బంగారు నల్లపూసలతాడు, ఒక జత చెవికమ్మలు, వంక ఉంగరం, చైన్ దొంగిలించారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈమేరకు బస్టాండ్‌లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని సిరిసిల్ల పట్టణంలోని పెద్దబజార్‌లో అదుపులోకి తీసుకొని విచారించామని తెలిపారు. దొంగిలించిన అభరణాలు స్వాధీనం చేసుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. బంగారంతో వెళ్లేటపుడు రద్దీ ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలని, మహిళలు బంగారు అభరణాలతో ప్రయాణం చేసేటపుడు తొడుగా ఎవరినైనా తీసుకెళ్లాలన్నారు. రద్దీ ప్రదేశాల్లో, బస్టాండ్‌లలో ఎవరైనా అనుమానస్పద వ్యక్తి కనిపిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఇంట్లోని బంగారు అభరణాలు, నగదును బ్యాంక్ లాకర్‌లలో భద్రపరుచుకోవడం క్షేమం ఆయన తెలిపారు.

హత్యాయత్నంపై ముందుకు సాగని విచారణ

● కమిషనరేట్‌కే సవాల్‌గా మారిన కేసు

కోల్‌సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో సంచలనం సృష్టించిన పరంకుశం యశ్వంత్(36)పై జరిగిన హత్యాయత్నం కేసు విచారణ ముందుకు సాగడం లేదు. నాలుగు నెలలు గడిచినా కేసులో పురోగతి లేదు. రామాలయం సమీపంలోని సింగరేణి క్వార్టర్‌లో ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్ సోర్సింగ్ కార్మికుడు, ఫిజిషియన్ అసిస్టెంట్ అయిన యశ్వంత్‌పై జనవరి 7న హత్యాయత్నం జరిగింది. ఇంటివెనుక నుంచి ఇంట్లోకి చొరబడిన నిందితులు కత్తులతో అతడి తల, ముఖంపై దాడిచేశారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. అతడి భార్య ప్రతిమ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తుంది. యశ్వంత్ ఫోన్‌లిఫ్ట్ చేయకపోవడంతో ఆమె ఇంటికి వచ్చి చూసే సరికి రక్తం మడుగులో కొట్టుమిట్టాడుతుండగా పోలీసులకు సమాచారంఇచ్చి ఆసుపత్రిలో చేర్పించారు. ఇంట్లో సీసీకెమెరాల ఫుటేజీని పరిశీలించగా ఒక వ్యక్తి కదలికలను గుర్తించారు. అతడి గురించి ఎంత ప్రయత్నించినా వివరాలు దొరకలేదని సమాచారం. సమీప కాలనీల్లోని సీసీఫుటేజీలను పరిశీలించినా ఆధారాలు దొరకలేదు. హత్యాయత్నానికి పాల్పడిన వారు వేలిముద్రలు లేకుండా జాగ్రత్తపడ్డారు. ఘటన జరిగిన సమయంలో నగదు, ఆభరణాలు ఉన్నా వాటిని ముట్టుకోలేదు. దీంతో ఉద్దేశ్యపూర్వకంగా దాడికి వచ్చిన వారుగాపోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కాల్‌డాటాను, ఇతర ఆధారాలను విశ్లేషించారు. కుటుంబసభ్యులు, బంధువులు, ఇతర అనుమానితుల సమాచారాన్ని సేకరించి విచారణ జరిపారు. ఎక్కడా కూడా ఆధారాలు లేక కేసు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం యశ్వంత్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడు కోలుకున్నా మాట్లాడడం, మనుషులను గుర్తు పట్టే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఈకేసు రామగుండం కమిషనరేట్‌కే సవాల్‌గా మారింది.

● అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నాం - గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్

యశ్వంత్ హత్యాయత్నం కేసుపై అన్నీ కోణాల్లో విచారణ జరుపుతున్నాం. టెక్నాలజీని కూడా వాడుతున్నాం. పలువురు అనుమానితులను విచారించాం. ఫోన్ల డాటాను కూడా రిట్రీట్ చేస్తున్నాం. త్వరలోనే ఛేదించేలా కృషి చేస్తున్నాం.

గ్రామస్థులు ఒక్కటయ్యారు.. కబ్జా భూమిని కాపాడారు


ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసిన బోరును చూపుతున్న గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

మెట్‌పల్లి రూరల్, మే, 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామ శివారులోని తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు ఇటీవల ఆక్రమించి చదును చేసిన విషయాన్ని పలుమార్లు గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం గ్రామస్థుల ఫిర్యాదు మేరకు అధికారులు సర్వే చేపట్టారు. గ్రామంలో తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. అందులో రెండు ఎకరాలలో మామిడి, నాలుగు ఎకరాల్లో బోర్లు ఏర్పాటు చేసుకోని వరి సాగుచేస్తున్నట్లు గుర్తించారు. అధికారులు ఆక్రమణకు గురైన భూమిని గుర్తించి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అధికారులు హద్దులు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఎవరైనా అక్రమించిన, చదును చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళను బెదిరించి డబ్బులు దోపిడీ

కరీంనగర్ అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామానికి చెందిన మాంకాళి మీనను శుక్రవారం ఉదయం బద్దిపెల్లి వద్ద గుర్తుతెలియని వ్యక్తి చంపుతానని బెదిరించి ఆమెవద్ద ఉన్న 4వేల రూపాయల నగదును దోచుకున్నాడని కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మీనా కమాన్‌పూర్ నుంచి కొండాపూర్‌లో శుభకార్యానికి వెళ్తోందని, బద్దిపల్లి శివారులో దోపిడీకి గురైందని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదుతో కొత్తపల్లి పోలీసులు కేసు నమోదుచేశారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామని సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ నాలుగు, ఆరోసెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం మాల్‌ప్రాక్టీస్ చేసిన ఏడుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. కిమ్స్ డిగ్రీకళాశాల కరీంనగర్ ఒకరు, ప్రభుత్వ డిగ్రీకళాశాల పెద్దపల్లిలో ఇద్దరు, అపూర్వ డిగ్రీకళాశాల కరీంనగర్‌లో ఇద్దరు, చాణిక్య డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఒకరు, వాగ్దేవి, డిగ్రీ కళాశాల హుజూరబాద్ కేంద్రంలో ఒకరు చొప్పున ఉన్నారని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం


మమత(ఫైల్)

కరీంనగర్ క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కుచెందిన చెల్లోజు మమత(36) అదృశ్యమైనట్లు కేసునమోదు చేశామని త్రీటౌన్‌పోలీసులు శుక్రవారం తెలిపారు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన మమత ఆచూకీ లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు ఫిర్యాదుచేసినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీతెలిసినవారు కరీంనగర్ త్రీటౌన్‌పోలీసులకు ఫోన్‌నంబర్ల 9392373873, 9491475061, 8712670763కు తెలపాలని సూచించారు.

బెట్టింగ్ పేరుతో మోసం

● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

మల్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో పెద్దహనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాది భక్తులు తరలిరావడంతో శుక్రవారం బెట్టింగ్ ముఠా సభ్యులు నిలువు దోపిడీకి గురిచేశారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌అంటూ పెట్టిన పెటుబడికి రెట్టింపుఅంటూ దోపిడీకి పాల్పడిన ముఠాను కొందరు భక్తులు గుట్టురట్టు చేశారు. దిగువ కొండగట్టులో ముఠాగా ఏర్పడి కొందరు ఆన్‌లైన్‌లో పదినుంచి ఇరవైవేలవరకు యూపీఏ పేమెంట్స్ ద్వారా తీసుకున్నారు. అయితే ముఠాలోని సభ్యులే ఇతరులను ఆకర్షించేందుకు వారు కూడా పేమెంట్స్ చేయడంతో అది తెలియనికొందరు చెల్లించారు. అనుమానం వచ్చిన ఓ భక్తుడు ముఠా నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో భక్తుని వద్ద వసూలు చేసిన ఇరవై వేల రూపాయలు తిరిగిఇచ్చి ముఠా సభ్యులు అక్కడి నుంచి జారుకున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఇల్లందకుంట, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డివానిపల్లె గ్రామానికి చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీఎస్ఐ పిట్ల దిలీప్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గడ్డివానిపల్లె గ్రామానికి చెందిన ఎల్లవేని అయిలయ్య-సమ్మక్కకు ఇద్దరు కుమారులు హరీష్, జయపాల్ ఉన్నారు. వీరి ఇద్దరి మధ్య దారి విషయంలో కొంతకాలంగా గొడవ జరుగుతోంది. గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయతీ చేసుకున్నప్పటికీ ఒప్పందం కుదరలేదు. దీంతో గురువారం సాయంత్రం జయపాల్, అతడి మామ గడ్డి కొంరయ్య ఇంట్లో ఉన్న గొడ్డలితో హరీష్‌పై దాడికి యత్నించారు. హరీష్ భార్య అనూష అడ్డుకోబోగ ఆమెకు తీవ్ర గాయాల య్యాయి. వెంటనే ఆమెను జమ్మికుంటలోని ఆస్పత్రికి ప్రథమచికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు జయపాల్, కొంరయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీ ఎస్ఐ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు.

మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు న్యాయం చేయాలి

● సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు

ధర్మపురి, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి న్యాయంచేయాలని సహచర ఎమ్మెల్యేలతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గం ఏకపక్షంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలిపడంతో విజయానికి ఎంతో తోడ్పడ్డారన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ సామాజికవర్గంలో మూడొంతులు మాదిగలు ఉండగా కీలక పదవుల్లో మాదిగలకు చాలా తక్కువ ప్రాతినిధ్యం ఉందని తెలిపారు. కేబినెట్లో కేవలం ఒకమాదిగ ఉపవర్గానికి మాత్రమే మంత్రి పదవి ఇచ్చారన్నారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి ఒక అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఆయన వెంట తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శ్యామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తదితరులు పాల్గొన్నారు.

● ప్రశ్నించే వారికి బీజేపీ వేధింపులు..

పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి వ్యతిరేకంగా ఒక్కమాట కూడా మాట్లాడలేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈడీ ఛార్జ్ షీట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పేరు ఉందని బీఆర్ఎస్, బీజేపీ తెగ హడావుడి చేస్తుందని ఆయన విమర్శించారు. విపక్ష పార్టీలపైన కేంద్రం ఈడీని ప్రయోగిస్తుందని, ప్రశ్నించే వారిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేధిస్తుందని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి దేశంలోనే గొప్ప పేరు వస్తుందనే భయంతో బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదం జరిగితే పట్టుకునేది ఎలా?

● ప్రమాదం జరిగే ప్రాంతాల్లో లేని సీసీ కెమెరాలు ● పోలీసుల దర్యాప్తుకు ఇబ్బందిగా మారుతున్న వైనం


తుమ్మన్నపల్లి గ్రామంలో చెట్టును ఢీకొన్న లారీ(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదాలు జరిగిన సమయంలో తప్పు ఎవరిది అన్నది తెలియకపోవడంతో పోలీసుల దర్యాప్తునకు ఇబ్బందిగా మారుతోంది. మండలంలో ఆయాగ్రామాల్లో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా, అలాంటి ప్రాంతాల్లో ప్రమాదం సంభవించే ప్రాంతాలుగా అధికారులు గుర్తించి వాటివద్ద సీసీకెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు లేకపోవడంతోనిందితులను పట్టుకోవడం అధికారులకు సవాల్‌గా మారుతోంది.

● ప్రమాద జరిగే ప్రాంతాల్లో లేని సీసీ కెమెరాలు

కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై ఉన్న తుమ్మన్నపల్లి, సింగాపూర్, లింగాపూర్ క్రాస్‌రోడ్డులవద్ద తరుచూ రోడ్డుప్రవదాలు జరుగుతుంటాయి. రాత్రివేళల్లో లారీ డ్రైవర్లు వేగంగా వస్తున్న వేళ ద్విచక్రవాహనాదారులు ప్రాణాలను అరచేతిలో పెటుకొని నడుపుతున్నారు. ఈ సమయంలో అనుకొని ప్రమాదం జరిగితే తప్పు లారీడ్రైవర్‌దా లేక ద్విచక్రవాహనదారుడిదా అనేది తెలియడంలేదు. కారణం ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడమే. అలాగే పర్కాల్ క్రాస్‌రోడ్డు వద్ద, హుజూరాబాద్ నుంచి జమ్మికుంట పట్టణానికి వెళ్లేదారిలో రంగాపూర్ నుంచి మొదలు శాలపల్లి-ఇందిరానగర్ గ్రామాల వరకు తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేక పోవడంతో ప్రమాద ఘటనపై బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసునమోదు చేసినవేళ టెక్నికల్‌గా నిందితులను పట్టుకోవడం పోలీసులకు ఇబ్బందిగా మారుతోంది.

● రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తోంది..

- బాషవేని రాజేష్‌యాదవ్, గ్రామస్థుడు,సింగాపూర్



కరీంనగర్-వరంగల్ రహదారి మా గ్రామం గుండా వెళ్తుంది. ఈ గ్రామంలో నెలలో మూడు, నాలుగు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తోంది. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో తప్పు ఎవరిదో అర్థం కావడంలేదు. తరుచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలి.

● ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో భద్రత చర్యలు తీసుకోవాలి

-బింగి కరుణాకర్, మాజీసర్పంచ్, రంగాపూర్



ప్రమాదాలు జరిగే ప్రాంతాలను అధికారులు వెంటనే గుర్తించి, ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లను, రెడ్ స్టిక్కర్స్‌లను ఏర్పాటు చేయాలి. ప్రమాదం జరిగే ప్రాంతమంటూ హెచ్చరికబోర్డులను ఏర్పాటు చేసి వాహనదారులు ప్రమాదాలబారిన పడకుండా చూడాలి.

స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖఅధికారి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. 2025-26విద్యాసంవత్సరానికి ప్రాంతీయక్రీడాహాస్టల్ హనుమకొండ, అథ్లెటిక్స్ అకాడమీఖమ్మం, సైక్లింగ్,రెజ్లింగ్ అకాడమీ, ఉస్మానియాయూనివర్సిటీ క్యాంపస్ హైదరాబాద్, హాకీఅకాడమీ వనపర్తి, సరూర్‌నగర్, వాలీబాల్అకాడమీ రాజన్నసిరిసిల్ల, సిద్దిపేట, మహబూబ్‌నగర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులుఆహ్వానిస్తున్నట్లు వివరించారు.

● **అకాడమీలు, ఎంపిక తేదీలు**

సిద్దిపేట వాలీబాల్అకాడమీలో ప్రవేశానికి జూన్1న సిద్దిపేటలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. సైక్లింగ్,రెజ్లింగ్ అకాడమీలకు ఉస్మానియాయూనివర్సిటీ క్యాంపస్ హైదరాబాద్‌లో జూన్10,11తేదీల్లో పోటీలు నిర్వహించనున్నారు. రీజనల్‌స్పోర్ట్స్ హాస్టల్ హనుమకొండలో ఎంపికపోటీలను జూన్ 10,11తేదీల్లో నిర్వహిస్తారు. వాలీబాల్ అకాడమీలు సరూర్‌నగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో ప్రవేశాలకు ఎంపికపోటీలను రాజన్నసిరిసిల్ల, వాలీబాల్ అకాడమీలో జూన్10వ తేదీన నిర్వహించనున్నారు. హాకీ అకాడమీ వనపర్తిలో ప్రవేశాలకు డీఎస్ఏ వనపర్తిలో జూన్ 12న, అథ్లెటిక్స్ అకాడమీ ఖమ్మంలో ప్రవేశాలకు డీఎస్ఏఖమ్మంలో జూన్ 12న ఎంపికపోటీలను నిర్వహించనున్నారు. వాలీబాల్ అకాడమీ మహబూబ్‌నగర్‌లో ప్రవేశాలకు డీఎస్ఏ మహబూబ్‌నగర్‌లో జూన్ 12,13తేదీల్లో నిర్వహిస్తారు.ఆసక్తిగల క్రీడాకారులు జననధ్రువీకరణపత్రం, సంబంధిత సర్టిఫికెట్‌లతో ఆయా తేదీల్లో సంబంధిత అకాడమీల్లో రిపోర్టు చేయాలని క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

రేపు ఉమ్మడి జిల్లా అండర్-17 చదరంగం ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాఅండర్-17 బాలబాలికల చదరంగం ఎంపికపోటీలను ఆదివారం జిల్లాకేంద్రంలోని రాంనగర్ విశ్వనాథ్ చెస్అకాడమీలో నిర్వహించనున్నట్లు కన్వీనర్ అంతగిరిరాజేంద్రప్రసాద్ తెలిపారు. 2008జనవరి1తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తిగల క్రీడాకారులు శనివారం సాయంత్రం 5గంటలలోగా 9390177607నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి డాక్టర్ల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హాస్పిటల్స్అండ్‌నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(తానాకన్) ఆధ్వర్యంలో డాక్టర్ రాష్ట్ర సదస్సును శనివారం నుంచి కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో నిర్వహించనున్నట్లు తానాకాన్ ఆర్గనైజింగ్‌చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కార్యదర్శి చాట్ల శ్రీధర్, కోశాధికారి డాక్టర్ బండారి రాజ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు500నుంచి800 మంది డాక్టర్లు ఈసదస్సుకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతఅధునాతన వైద్యవిధానం, చికిత్స తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఫిబ్రవరి 2025లో నిర్వహించిన డిగ్రీ, ప్రథమ, ద్వితీయ, తృతీయసెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ విడుదలచేశారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.


దేవాలయంలో భక్తుల రద్దీ


సరస్వతి నది తీరాన భక్తులు





పుష్కర తీరం
పులకించిన భక్తజనం

● హాజరైన హంపి పీఠాధిపతి
● తొమ్మిదో రోజు 1.3 లక్షల మంది భక్తుల పుణ్యస్నానాలు

కాళేశ్వరం, మే 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాల్లో తొమ్మిదో రోజు శుక్రవారం 1.3 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పుష్కరాలకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉండడంతో భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ సందర్భంగా భక్తులు త్రివేణి సంగమంలో చీరె, సారె, పూలు, పండ్లు, దీపాలు సమర్పించారు. పలువురు భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానాలు చేసి తర్పణాలు వదిలి దానధర్మాలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. హంపి విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి శుక్రవారం పుణ్యస్నానం ఆచరించారు. భక్తులకు స్వామీజీ ప్రసాదాలను పంపిణీ చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో నదిలో పుణ్యస్నానం ఆచరించి ముక్తీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుభానందదేవి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం దేవాదాయ శాఖ అధికారులు ఆలయ శేష వస్త్రాలతో ఎమ్మెల్యేను సన్మానించారు.

● **కన్నుల పండువగా హారతి**

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో కాశీ పండితుల ఆధ్వర్యంలో హారతిని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ పండితులకు స్థానిక అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి పూర్ణాహుతులతో హారతి సమర్పించారు. ఈ హారతి కార్యక్రమం సరస్వతి నవరత్న మాల ఉత్సవాల్లో ఒక ముఖ్యమైన ఘట్టం అని అర్చకులు తెలిపారు.






భక్తుల పుణ్యస్నానాలు


రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడకు పోటెత్తుతున్న భక్తులు

● రోజురోజుకు పెరుగుతున్న తాకిడి
● 60వేల మంది వచ్చినట్లు అంచనా

వేములవాడ కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. వేసవి సెలవులు, రాజన్న ఆలయం జూన్ 15వ తేది వరకు మూసివేస్తారని ప్రచారం జరగడంతో భక్తులు తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. శుక్రవారం రాజన్నను 60వేల మంది వరకు భక్తులు దర్శించుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ఆవరణ రద్దీగా మారిపోయింది. ఉదయాన్నే భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. పరివార దేవతాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బద్ది పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునేందుకు క్యూలైన్‌లో వేచివున్న భక్తులు రాజన్న దర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు తెలుస్తోంది.

నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మే 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రం లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం హనుమాన్ భక్తులరద్దీ నెలకొంది. ఉదయం సుదూర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు క్షేత్రానికితరలివచ్చారు. కొండగట్టు ఆంజనేయ స్వామిదర్శనం అనంతరం అనేకమంది హనుమాన్ దీక్షాపరులు క్షేత్రానికి వచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు నేరుగా లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేక పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కురవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద

జగిత్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం స్వల్పంగా వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీలోకి 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 11.781 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 652క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 321 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

మహిళా హోంగార్డును అభినందించిన ఎమ్మెల్యే

● నగదు ప్రోత్సాహకం అందజేత


ప్రోత్సాహకం అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): మహిళా హోంగార్డును చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం కరీంనగర్‌లోని క్యాంప్‌ఆఫీస్‌లో శుక్రవారం సత్కరించారు. కొండగట్టులో జరిగిన పెద్ద హనుమాన్ జయంతికి వచ్చిన చొప్పదండి మండలం కాట్నపల్లికి చెందిన వృద్ధురాలు బండారి శంకరమ్మ గురువారం అస్వస్థతకు గురై అయి పడిపోయింది. సమీపంలో విధులు నిర్వహిస్తున్న మహిళ హోంగార్డు కేసరి స్వరూప తన భుజాలపై మోసుకెళ్లి వైద్య శిబిరానికి తరలించారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మహిళహోంగార్డును శాలువతో సత్కరించారు. ఆమె సమయస్ఫూర్తిని అభినందించి నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, దొంగ ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, నారాయణగౌడ్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జగిత్యాల విద్యార్థులు


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జగిత్యాల అగ్రికల్చర్, మే 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు జగిత్యాల జిల్లాకేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులను శనివారం మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈపోటీలను అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గువ్వ శ్రీనివాస్, పాదం మహేందర్‌తోపాటు కవిగాయకుడు జలపతి ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 100మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ కనబర్చిన సుమారు 15మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను జిల్లాక్రీడల అధికారి రవికుమార్, జిల్లాబాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాగర్, జాయింట్ సెక్రటరీ అరుణ్, సభ్యులు మహిపాల్, రాజు, రాజేందర్, పాదం తిరుపతి, కోచ్‌లు వంశీకృష్ణ, నవీన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి బోనాలు

మల్లాపూర్, మే, 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి గ్రామంలో గంగమ్మ తల్లి బోనాల పండుగను నిర్వహకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలోని అమ్మ వారికి భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తిశ్రద్ధలతో కొత్త కుండలను అలంకరించి బోనాం తయారు చేశారు. భక్తులు బోనం నెత్తిన ఎత్తుకుని గ్రామంలోని పురవీధుల గుండా రాగా మహిళలు మంగళహారతులు, గంగపుత్రుల సంప్రదాయ వృత్తికి సంబంధించిన గొళ్లెంవిన్యాసాలతో ఊరేగింపుగా ఆలయానికి బయలు దేరారు. భక్తులు బోనంతో ఆలయం చుట్టు ప్రదిక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు రేడ్డు రాజు, సంఘం సభ్యులు, భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


వేంపల్లిలో బోనాలతో గంగమ్మతల్లి ఆలయంకు బయలు దేరిన భక్తులు


ఆలయ ఆవరణలో భక్తులు


కోనేరులో తొలగించని నీరు


మెట్లపై బురద

అంజన్నా.. వెళ్లొస్తాం..

● ముగిసిన హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు ● నేటి నుంచి ఆర్జితసేవలు పునరుద్ధరణ

మల్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి వేడుక లు ఘనంగా ముగిశాయి. చివరిరోజు గురువారం అర్ధరాత్రి వరకు భక్తులతో కొండగట్టు కిక్కిరిసి పోగా శుక్రవారం కూడా రద్దీ నెలకొంది. వేలాదిగా హనుమాన్ భక్తులు దీక్షవిరమణ మండపంలో మాలవిరమణ చేసి అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజులు జరిగిన జయంతికి లక్ష లాదిగా వచ్చిన భక్తులు వెళ్లొస్తాం.. అంజన్న.. చల్లంగా చూడు.. అంటూ తిరిగి వెళ్లారు.

ఉత్సవాలు విజయవంతం..

జయంత్యుత్సవాలు విజయవంతంగా ముగియడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ దేవస్థానం తరుపున అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పర్యవేక్షణలో భక్తులకు సేవలు అందించిన పోలీస్, పంచాయితీరాజ్, ట్రాన్స్‌కో, ఆర్టీసీ, వైద్య, అగ్నిమాపక, 108, రెవెన్యూ, దేవాదాయ, మిషన్ భగీరథ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి, స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను కొనియాడారు. అందరి సహకారంతోనే ఉత్సవాలు విజయవంతం అయినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి వాహన పూజలు..

హనుమాన్ జయంతి సందర్భంగా నిలిపివేసిన అర్జిత సేవలను తిరిగి కొనసాగించనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. శనివారం నుంచి వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు తదితర పూజలు యథావిధిగా ఉంటాయని భక్తులు గమనించాలని సూచించారు.

వందలాది సిబ్బంది ఉన్నా.. లోపించిన పారిశుధ్యం

హనుమాన్ జయంతి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు కొండగట్టుకు తరలిరాగ కొండపై అపరిశుభ్రత భక్తులను అసహనానికి గురిచేసింది. అడుగడుగున చెత్త దర్శనం ఇవ్వగా స్నానాలు చేయడానికి కోనేరుకు వెళ్లే మార్గం ద్వారం వద్దే బురదతో పాటు భక్తులు సమర్పించిన తలనీలాలు, చెత్తకుప్పలు ఉండడంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. స్వామి వారి దర్శనం చేసుకొని వచ్చే వెనుక ద్వారం మెట్లన్నీ బ్లీచింగ్‌తో బురదగా మారి భక్తులు కొందరు జారిపడ్డారు. ఆలయంలోనూ భక్తులు వచ్చే మార్గంలో ముడుపుల బియ్యం కుప్పలుగా ఉండగా వాటిని వెంట వెంటనే తొలగించకపోవడంతో వర్షానికి తడిసి ముద్దయ్యాయి. పారిశుధ్యం కోసం సుమారు నాలుగు వందలపైగా సిబ్బందిని నియమించినప్పటికీ అపరిశుభ్రతే దర్శనం ఇవ్వడంపై భక్తులు, దీక్షాపరులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.


ఆలయ ఆవరణలో భక్తులు చెల్లించుకున్న ముడుపులు

కార్పొరేషన్‌లో లెస్‌టెండర్లు

(5వ పేజీ తరువాయి)

అవలంబిస్తున్నారు. డ్రైనేజీలు పూడుకుపోయి మళ్లీ పనులు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

సగం రేట్లపై పనులెలా...

లెస్ టెండర్లు ఇష్టానుసారంగా దాఖలవుతున్నా యంత్రాంగం నోరు మెదపడం లేదు. సాధారణంగా లెస్ టెండర్లు దాఖలు చేసిన కాంట్రాక్టర్లు పనులను పెండింగ్‌లో పెట్టడం, ఏడాది రెండేళ్లకు నామమాత్రంగా పనులు చేసి రికార్డు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. 40శాతం తక్కువ రేట్లపై దాఖలవుతున్న టెండర్లలో పనులెలా సాగుతాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా బిల్లుల రికార్డుల్లో ఎఫ్ఎస్‌డీలు, లేబర్‌సెస్, సీనరేజ్, డీఎంఎఫ్‌టీ, ఎస్ఎంఎఫ్‌టీ, ఐటీ, గ్రీన్‌ఫండ్, న్యాక్, పర్మిట్ ఫీజు తదితర మినహాయింపులు ఉంటాయి. సగం కన్నా తక్కువ రేట్లపై పనులు ఎలా సాధ్యమనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

కఠినంగా వ్యవహరిస్తేనే ప్రజలకు ప్రయోజనం...

నిబంధనల ప్రకారం లెస్ టెండర్లు దాఖలు చేసిన వారి నుంచి వెంటనే అడ్వాన్స్ సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేయాల్సి ఉంటుంది. టెండర్ అంచనాలపై 25శాతం దాటితే మిగిలిన మొత్తాన్ని ఏఎస్‌డీగా జమ చేయించుకోవాల్సి ఉంటుంది. వెంటనే కాంట్రాక్టర్లతో పనులు మొదలు పెట్టించడం, టెండర్ ప్రకారం నాణ్యతతో పనులు చేయించాల్సి ఉంటుంది. ముఖ్యంగా బిల్లుల రికార్డు సమయంలో ఇంజనీరింగ్ విభాగం నిబంధనల ప్రకారం పని చేస్తే సమస్య ఉండదు. సాధారణంగా బిల్లును సిఫార్సు చేసే సమయంలో కమిషనర్ పనిని పరిశీలించాల్సి ఉంటుంది. కమిషనర్ క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించకుండానే సిఫార్సు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీవో తనిఖీలు

ఓదెల, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీవో గంగయ్య తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో నిర్వహిస్తున్న భూముల సవరణపై ఆరా తీశారు. భూముల రికార్డులను తనిఖీ చేస్తూ ఎక్కువ, తక్కువ ఉన్న భూముల సవరణను జాగ్రత్తగా నిర్వహించాలని కోరారు. అనంతరం ఇన్‌వార్డు సెక్షన్‌లో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ ధీరజ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

గోవులను సంరక్షించాలి

కళ్యాణ్‌నగర్, మే 23(ఆంధ్రజ్యోతి): గోవులను సంరక్షించి గోరక్ష చట్టాలను కఠినంగా అమలు చేయాలని వీహెచ్‌పీ నగర కార్యదర్శి మేడగోని రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం రామగుండం ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ హిందువులు పూజించే గోమాతను కాపాడాలని, మానవుల మనుగడకు తోడ్పడే ఆవులను వధిస్తున్న గోభక్షకుల నుంచి గోవులను కాపాడాలని కోరారు. చెక్ పోస్టులను ఏర్పాటు చేసి గోవులను ఎగుమతి చేయకుండా అరికట్టాలన్నారు. వీహెచ్‌పీ నాయకులు బండ రాజేశం, లింగన్న, సంపత్, శ్రీనివాస్, అరవింద్, రమేష్, మోహన్, రాజు ఉన్నారు.

రోగులకు నిత్యావసర సరుకుల పంపిణీ

కళ్యాణ్‌నగర్, మే 23(ఆంధ్రజ్యోతి): డయాలసిస్ రోగులకు శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్‌ఎంఓ రాజు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. జ్యోతి గాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్లి గణేష్ కుమార్ వర్ధంతి సందర్భంగా నిత్యావసర వస్తువులను ఆమె సతీమణి తులసి, కుమారుడు బృహత్, కుమార్తె శివమాన్య అందించడం అభినందనీయమన్నారు. దయానంద్‌గాంధీ, పీఆర్‌ఓలు కృష్ణ, అన్వర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా సాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ

ఎలిగేడు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఫార్మర్ రిజిస్ట్రీ ముమ్మరంగా సాగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి ఉమపతి అన్నారు. రైతువేదికలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 10రోజుల నుంచి ఫార్మర్ రిజిస్ట్రీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతీ రైతు భూమి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతీ రైతుకు 11నంబర్లతో కూడిన విశిష్ట సంఖ్య కేటాయిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాలు దాని ద్వారా అమలవుతాయని పేర్కొన్నారు. ఆధార్ నంబర్, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ లింక్ చేయబడిన ఫోన్ నంబర్ ఉండాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 1055మంది ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మిగితా రైతులు సత్వరమే స్పందించాలన్నారు. ఏఈఓ సురేష్, గణేష్, రైతులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి లయన్స్‌క్లబ్ చేయూత

రామగిరి, మే 23(ఆంధ్రజ్యోతి): పన్నూరు గ్రామానికి చెందిన నిరుపేద యువతి పుట్ట రజిత వివాహనికి పెద్దపల్లి లయన్స్‌క్లబ్ సభ్యులు ఆర్థిక చేయూతనిచ్చారు. తండ్రి మరణంతో రజిత వివాహం తల్లి రాధమ్మకు భారంగా మారింది. లయన్స్‌క్లబ్ సభ్యుల సహకారంతో సేకరించిన రూ.22116 నగదులను శుక్రవారం పెళ్లి మండపంలో అందజేశారు. రమేశ్, రాంకిషన్, సాదుల వెంకటేశ్వర్లు, జయపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

హైకోర్టుకు చేరిన అక్రమ నిర్మాణం కేసు

మంథని, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరుకలగూడెం ఎస్ఆర్‌కే అపార్టుమెంట్ సమీపంలో సర్వే నెం. 94/సీ, ఇంటి నెం. 2-5/4/2 గల అక్రమ నిర్మాణం కేసు హైకోర్టు చేరినట్లు రిట్ పిటిషనర్ ఎడ్ల సదాశివ్ గురువారం తెలిపారు. ఇంటి యజమాని మండల మంగ 2023లో 302 గజాల స్థలంలో భవన నిర్మాణం కోసం గ్రౌండ్‌ఫ్లోర్ ప్లస్ రెండు అంతస్తులకు అనుమతి తీసుకొంది. అక్రమంగా ఆపై రెండు అంతస్తులతో పాటు వాణిజ్య భవనం నిర్మాణం చేశారని, దీని పై విచారణ జరిపి చర్య తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, అదనపు కలెక్టర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. రిట్ పిటిషన్‌పై హైకోర్టులో సీనియర్ న్యాయవాది కే.మోహన్‌గౌడ్, పిటిషనర్ న్యాయవాది ఇనుముల సత్యనారాయణలు వాదనలు వినిపించగా, మున్సిపల్ శాఖ నుంచి స్టాండింగ్ కౌన్సిల్ పుట్ట క్రిష్ణారెడ్డి హాజరైనట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించి, 4 వారాల్లో చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరుపాలి

గోదావరిఖని, మే 23(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులపై శాంతియుత చర్చలు జరుపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఈదునూరి నరేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో నరమేధం సృష్టిస్తున్నారని, దీనిపై ఈనెల 25న గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఆపరేషన్ సిందూర్‌లో దాగి ఉన్న నిజాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఐ కృష్ణ, రాజేశం, మల్లేషం, రామకృష్ణ, దుర్గయ్య, రాజన్న, మల్లేషం పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ వివరాలు బహిర్గతం చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, మే 23(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ వివరాలను బహిర్గతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మంథని డివిజన్ కార్యదర్శి బీ అశోక్ డిమాండ్ చేశారు. ఆపరేషన్ సందూర్‌లో దాగి ఉన్న నిజాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాలనీలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పహెల్గాం ఉగ్రదాడిని యావత్ దేశం ఖండించినట్టు తెలిపారు. ఈదాడి ఘటనపై కేంద్రం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. శారద, మదునమ్మ, లింగయ్య, దుర్గం పోచం, స్వామి, లింగయ్య, అనసూయ పాల్గొన్నారు.

అకాల వర్షాలతో తడుస్తున్న ధాన్యం

జూలపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవుతోంది. కొనుగోళ్ల చివరి దశకు చేరుకుంటుండగా కేంద్రాల్లో పనిచేస్తున్న హమాలీలను కొందరు మక్కల కొనుగోళ్లకు వాడుకోవడంతో ధాన్యం కొనుగోలు ముందుకు సాగడం లేదని విమర్శిస్తున్నారు. ఒక్కోలారీకి పది క్వింటాళ్ల చొప్పున మిల్లులో కోతలు విధించి రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీధర్‌బాబుపై విమర్శలు మానుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, మే 23(ఆంధ్రజ్యోతి): మంత్రి శ్రీధర్‌బాబుపై విమర్శలు మానుకోవాలని ఐఎన్‌టీయూసీ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్ సూచించారు. శుక్రవారం యూనియన్ ఆఫీస్‌లో మాట్లాడారు. మంత్రిని బద్నాం చేసే రీతిలో రాజకీయ ఆరోపణలు చేస్తున్నట్టు తెలిపారు. దశరథం, కొంగర రవీందర్, మల్లేష్, అశోక్, సురేష్, పాల్గొన్నారు.

పాకిస్థాన్‌పై దాడితో సత్తా చాటిన భారత సైన్యం



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, నాయకులు

పెద్దపల్లి టౌన్, మే 23 మే 23 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడికి ప్రతి దాడి చేసి ప్రపంచ దేశాలకు భారత సైన్యం సత్తాచాటామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పిలుపులో భాగంగా పహెల్గాం వద్ద ఉగ్రవాదులు జరిపిన దాడికి ప్రతీకార దాడులను చేసి పాకిస్థాన్ దేశానికి తగిన గుణపాఠం చెప్పిన దేశ సైనికుల వెంట తామున్నామని జిల్లా కేంద్రంలో శుక్రవారం తిరంగా ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ పాకిస్థాన్‌తో జరిపిన యుద్ధంతో ప్రపంచ దేశాలు భారత్ వైపు కన్నెత్తి చూడాలంటే భయపడేలా చేశారని అభినందించారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో 34 నిమిషాల్లోనే శత్రుదేశంలోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేశారన్నారు. పహెల్గాం ఘటన తర్వాత పాకిస్థాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని భావించినట్లు ఆపరేషన్ సిందూరులో పాల్గొన్న సైనికుడు అరీఫ్ తెలిపారు. దేశమంతా ఒక్కటిగా నిలవడం గర్వంగా ఉందని, యువత సైన్యంలో చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆరీఫ్‌ను ఉపాధ్యాయ సన్మానించారు. సిటిజన్ ఫర్ నేషన్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో జరిగిన తిరంగా ర్యాలీకి ప్రజలు భారీగా తరలివచ్చారు. వ్యాపారులు, ఉద్యోగులు, అధికారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబట్టి భారత్ మాతా కీ జై, జైజవాన్ జై కిసాన్ నినాదాలతో హోరెత్తించారు. మాజీ ఎమ్మెల్యే లింగయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, కందుల సంధ్యారాణి, ఠాకూర్ రాంసింగ్, కన్నం అంజయ్య, పల్లె సదానందం, పర్ష సమ్మయ్య, వెల్లంపల్లి శ్రీనివాసరావు, కంకణాల జ్యోతిబసు, జంగ చక్రధర్ రెడ్డి, సంతోష్, కోల హిమగిరి, నరేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులలో అభ్యాసనను మెరుగుపరచాలి


పుస్తకాలు అందజేస్తున్న తహసీల్దార్

సుల్తానాబాద్, మే 23: (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులలో నేర్చుకుంటున్న విషయాలను పాఠశాలల్లో అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ రిసోర్స్‌పర్సన్ ప్రవీణ్ అన్నారు. గర్రెపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారం భించారు. ఆయన మాట్లాడుతు విద్యార్థులలో ప్రధానంగా అభ్యసనను మెరుగుపరుచాలన్నారు. విద్యార్థులు అన్ని సామర్థ్యాలు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ బి సురేష్ కుమార్, కోర్స్ డైరెక్టర్ వి కవిత, ఆర్పీలు నరేష్ కుమార్, సాధన, ప్రత్యక్ష, సీఆర్పీలు లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ బి శిరీష పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): శిక్షణతో బోధన నైపుణ్యత అభివృద్ధి చెందుతుందని తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ బోధన నైపుణ్యాల అభివృద్ధిపై తహసీల్దార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా శిక్షణతో పాటు డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలపడతాయని తెలిపారు. ఎమ్మార్వో రచించిన లిటిల్ బాలల కథల పుస్తకాన్ని మండల విద్యాధికారి మహేష్‌కు అందజేశారు. ఎంఈఓ మహేష్ మాట్లాడుతూ కష్టమైన సైన్స్ పాఠాలను అందరికీ తెలిసేలా చిన్నచిన్న కథల్లో ప్రచురించిన లిటిల్స్ కథల పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. ఆర్పీలు స్వప్న, సంపత్, వేణు, కుమార్, భానుచందర్, దేవేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందే విధంగా కృషి

పెద్దపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు నష్టాలు రాకుండా నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేటి అవినాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విత్తనాల విక్రయంలో ఈపాస్ యంత్రాల వినియోగంపై నిర్వహించిన శిక్షణలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి కరుణాకర్‌తో కలిసి పాల్గొన్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం విత్తనాల రకాలు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో కనీసం పది వేల క్వింటాళ్ల ప్రభుత్వ రంగ విత్తనాలు అమ్మాలని డీలర్లకు సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, రాబోయే సీజన్ లో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. వానాకాలం సాగుకు అవసరమయ్యే విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వానాకాలం పంటకు అవసరమైన ఎరువులు, డీఏపి టన్నుల స్టాక్ అందుబాటులో ఉందని, డీలర్ల వద్ద ఉన్న స్టాక్ వివరాలను ఈ పాస్ యంత్రాల్లో అప్ డేట్ చేయాలని కలెక్టర్ సూచించారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా పంట కాలాన్ని రెండు వారాలు ముందుకు జరపాలని, దానికి అనుగుణంగా అవసరమైన విత్తనాలు ఎరువులు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి పట్ల కఠినచర్యలు తీసుకుంటామని అన్నారు. విత్తనాల బ్యాగ్ పై లేబుల్, నిల్వ చివరి గడుపు తేదీ తెలిపి విక్రయించాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్లస్టర్ పరిధిలో ఎవరైనా అనధికారంగా విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, మండల వ్యవసాయ అధికారులు, డీలర్లు, పాల్గొన్నారు.

సొసైటీ సీఈవోలను బదిలీ చేయవద్దు

సుల్తానాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలలో పని చేస్తున్న సీఈవోలు ఉత్తమ సేవలందిస్తున్నారని, జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు సాఫీగా జరగడంలో వీరిది కీలక పాత్ర ఉందని, బదిలీ నుంచి మినహాయించాలని ఎమ్మెల్యే విజయరమణా రావు కేడీసీసీబీ అధ్యక్షులకు, ఉన్నతాధికారులకు సూచించారు. శుక్రవారం కేడీసీసీబీ భవనం ప్రారంభంలో ఎమ్మెల్యే సీఈఓల ప్రస్తావన తెస్తూ వారి సేవలను కొనియాడారు. ఎమ్మెల్యే తమ గురించి మాట్లాడడంతో సీఈఓలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

జీజీహెచ్ ఏడీ(అడ్మిన్)గా పద్మలత

కళ్యాణ్‌నగర్, మే 23(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జనరల్ ఆసుపత్రి ఏడీ(అడ్మిన్)గా కే పద్మలతను నియమిస్తూ శుక్రవారం పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ రవీంద్రనాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. సింగరేణి మెడికల్ కళాశాలలో ఏడాగా పని చేస్తున్న పద్మలతకు పదోన్నతిని కల్పిస్తూ గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఏడీ(అడ్మిన్)గా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలి


సుల్తానాబాద్‌లో రైస్‌మిల్లు తనిఖీ చేస్తున్న కలెక్టర్ కోయశ్రీహర్ష

సుల్తానాబాద్, మే 23: (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు చేరిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా అన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం పూసాలలోని మిథిలా రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లింగ్ విధానాన్ని, మిషనరీ పనితీరు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన తర్వాతనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నామని, ఎలాంటి కారణాలు చెప్పకుండా వెంటనే దిగుమతి చేసుకోవాలన్నారు. మిల్లర్లు రైతులకు ఎలాంటి కోతలు కటింగ్‌లు విధించవద్దని సూచించారు. ప్రభుత్వం మిల్లర్లుకు అం దించే సీఎంఆర్ బియ్యంను కూడా నిర్దేశిత గడువులోగా తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలన్నారు. జిల్లా పౌర సర పరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, డీటీసీఎస్‌లు మహేష్, రవీందర్ తో పాటు పలువురు రైస్ మిల్లర్లు ఉన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): రానున్న 3 నుంచి 4 రోజులపాటు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఈనెల 27 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.2కోట్లు మంజూరు

కోల్‌సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ 4వ డివిజన్ కృష్ణనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 4వ డివిజన్‌లో పాత రోడ్లు శిథిలం కావడం, కొత్తకాలనీలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ తన దృష్టికి తీసుకువచ్చారని, ఈ మేరకు అంచనాలు తయారు చేసి సమర్పించాలని కలెక్టర్ ఆదేశించగా నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు రూ.2కోట్లతో పనులు చేపట్టడానికి అంచనాలు తయారు చేసి సమర్పించారు. కలెక్టర్ ఆమోదం తెలిపారు. వెంటనే పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఆసుపత్రుల్లో త్వరలో బయోమెట్రిక్


తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్

మంథని, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేసే డాక్టర్లు, స్టాఫ్‌కు త్వరలోనే బయోమెట్రిక్ అటెండెన్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిని, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని డీసీహెచ్ఎస్ తనిఖీ చేశారు. ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ సామాజిక వైద్యశాల, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో విధులకు డుమ్మా కొట్టిన డాక్టర్లకు మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించి వారి సమస్య తెలుసుకొని నాణ్యమైన వైద్య సేవలు అం దించాలని సూచించారు. అత్యవసర పరిస్థితు ల్లో వచ్చే రోగులకు, గర్భిణీలకు తక్షణమే వైద్య సేవలు అందించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అంబులెన్సు, సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

జెన్‌కో సీఎండీని కలిసిన ఎమ్మెల్యే


జెన్‌కో సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మే 23(ఆంధ్రజ్యోతి): జెన్‌కో సీఎండీగా బాధ్యతలు చేపట్టిన హరీష్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మర్యాద పూర్వ కంగా కలిశారు. రామగుండం జెన్‌కోలో నిర్మించ తలపెట్టిన 800మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, ప్రాజెక్టు పురోగతి, ఆర్థిక సమర్థత, పర్యావరణ అనుమతులు, శాశ్వత ఉద్యోగాల కల్పన, స్థానికుల ప్రయోజనాల అంశాలపై చర్చించారు. అధికారులతో చర్చించి ప్రాజెక్టుకు పూర్తి మద్దతు ఉంటుందని హరీష్ హామీ ఇచ్చారన్నారు.

నేడు రైతులకు అవగాహన

కాల్వశ్రీరాంపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): తారుపల్లి గ్రామంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలచే రైతులకు పంటలపై అవగాహన కార్యక్రమం ఉంటుందని మండల వ్యవ సాయ అధికారి నాగార్జున తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, కునారం వ్యవసాయ శాస్త్రవేత్త సిద్ది శ్రీధర్‌తో పాటు పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని పంటలు, పురుగు మందులు, ఎరువులు తదితర విషయాలను వివరించనున్నట్లు తెలిపారు.

కార్మికులను పట్టభద్రులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


సమావేశంలో ఘంటా చక్రపాణి, సీఎండీ బలరామ్

గోదావరిఖని, మే 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రాంతంలోని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర గ్రామాలకు చెందిన వారిని పట్టభద్రులుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఘంటా చక్రపాణి, సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. కార్మికులను, వారి కుటుంబ సభ్యులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలపై శుక్రవారం సింగరేణి భవన్‌లో చర్చించారు. సింగరేణి ఆధ్వర్యంలో అంబేద్కర్ యూనివర్సిటీ నిర్వహణలో విద్యాబోధనకు గల అవకాశాలపై సమీక్షించారు. వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ కార్మికులు, పరిసర గ్రామాల ప్రజల విద్యాభివృద్ధికి తోడ్పడితే అన్నింటికన్నా పెద్ద సంక్షేమ కార్యక్రమం అవుతుందన్నారు. బోధనకు అనుకూలమైన భవనాలను కేటాయిస్తే ఓపెన్ యూనివర్సిటీ ద్వారా స్టడీ సెంటర్లను ఏర్పాటు చేయడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల్లో ఎక్కువ మంది హైస్కూల్, ఇంటర్మీడియట్ వరకు మాత్రమే చదివారన్నారు. పై చదువులు చదవాలన్న ఆసక్తి ఉన్నప్పటికి అవకాశాలు లేక బాధపడుతున్నారని, అ లాంటి వారికి అంబేద్కర్ యూనివర్సిటీ ద్వారా సింగ రేణి వ్యాప్తంగా స్టడీ సెంటర్లను ఏర్పాటు చేసి పై చదువులకు అవకాశం కల్పిం చాలనే ఉద్దేశ్యంతో సంస్థ ముందుకు వెళుతుందన్నారు. ఓపెన్ యూనివర్సిటీ రిజి స్ట్రార్ డాక్టర్ ఎల్.విజయ కృష్ణరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్ప ఘంటాచక్రపాణి, డైరెక్టర్ ప్రొఫెసర్ పల్లవికబ్డే, పీఆర్‌వో డాక్టర్ వేణుగోపాల్, సింగరేణి ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్‌డీ ఎం.సుభాని, జీఎంహెచ్‌ఆర్‌డీ రఘుపతి, మార్కెటింగ్ జీఎం రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

ఆర్జీ-3లో క్వార్టర్ల కౌన్సెలింగ్


క్వార్టర్స్ కౌన్సిలింగ్‌లో అధికారులు

రామగిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపిఏ డివిజన్‌లలో శుక్రవారం క్వార్టర్స్ కౌన్సెలింగ్ నిర్వహించారు. డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో 171 ఖాళీ క్వార్టర్స్ నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 66 మంది దరఖాస్తు చేసుకోగా 19 మంది హాజరయ్యారు. అందులో 18 మం ది ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలో క్వార్టర్స్ కేటాయింపు పత్రాలు జారీ చేస్తామని ఇంచార్జ్ పర్సనల్ గుర్రం శ్రీహరి తెలిపారు. గుర్తింపు సం ఘం నాయకులు డి. తిరుపతిరావు, సివిల్ విభాగం అధికారి ఫణీంద్ర, ఎస్టేట్స్ విభాగం అధికారి మణిదీప్‌రెడ్డి, రమ్య, సదయ్య పాల్గొన్నారు.

ఓసీపీ-5లో షావల్స్‌ను ప్రారంభించిన జీఎం


షావల్‌ను ప్రారంభిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే 5 ఇంక్లైన్‌లో రూ.3.6కోట్లతో కొనుగోలు చేసిన రెండు షావల్స్‌ను శుక్రవారం ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి వేగం పెంచడానికి షావల్స్‌ను కొనుగోలు చేశామని, పాత షావల్స్‌తో వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిన ఉద్యోగులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని కోరారు. నూతన షావల్స్‌కు మంజీ, మానేర్లుగా నామకరణం చేశారు. పీఓ చంద్రశేఖర్, ఇంజనీర్ వెంకటేశ్వర్‌రావు, ఏఎస్ఓ సాయి ప్రసాద్, సివిల్ డీజీఎం వరప్రసాద్, మేనేజర్లు పొనగోటి శ్రీనివాస్, రమేష్‌బాబు, నాయకులు మడ్డి ఎల్లయ్య, ఆరెల్లి పోషం, ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఏరియాను సందర్శించిన జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, మే 23(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాను శుక్రవారం జీఎం(ఐఅండ్‌పీఎం) మధుసూదన్ సందర్శించారు. ఆయన జీఎం వెంకటయ్యతో సమావేశమయ్యారు. ఏరియాకు సంబంధించి ఉత్పత్తి, ఉత్పాదకత, కార్పొరేట్‌లో ఉన్న ఫైల్స్ సంబంధిత విషయాలపై చర్చించారు. జీఎం(ఐఅండ్‌పీఎం)గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వచ్చిన మధుసూదన్‌కు జీఎం వెంకటయ్య సన్మానించారు. నరసింహారావు, సంతోష్‌కుమార్, అనిల్‌కుమార్, ధనుంజయ, వెంకట రామచంద్ర, జనార్దన్, పండరీనాథ్, వంశీధర్ పాల్గొన్నారు.

మారుపేర్ల సమస్య పరిష్కరించాలి

గోదావరిఖని, మే 23(ఆంధ్రజ్యోతి): మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసులు పరిష్కరించాలని శుక్రవారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ మాట్లాడుతూ సింగరేణిలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న డిపెండెంట్లకు మారుపేర్లు ఉన్నాయంటూ అధికారులు పెండింగ్‌లో పెట్టారని, సింగరేణి ఉద్యోగం రాక, ఉపాధి మార్గం లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. మారుపేర్ల సమస్యను పరిష్కరించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి అధికారులకు వినతిపత్రం అందించారు. నరేష్, అశోక్, బాధితులు శ్రావణ్, శ్రీనివాస్, సందీప్, కొమురమ్మ, రాజు, వెంకటేష్, రామకృష్ణ పాల్గొన్నారు.



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు



ఓసీపీ-2 మ్యాన్‌వే రహదారి పనులకు టెండర్ పూర్తి

రామగిరి, మే 23(ఆంధ్రజ్యోతి) సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2 మ్యాన్‌వే రహదారికి కోటి ఏనభై లక్షల నిధులు మంజూరై టెండర్ పూర్తయ్యాయి. కొంత కాలంగా మ్యాన్‌వే రహదారిలో వెళ్లాలంటే కార్మికులు ఇబ్బందులు పడిన నేపథ్యంలో ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోటరవీందర్‌రెడ్డి పలుమార్లు తారు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సింగరేణి సిఎండి బలరాంనాయక్‌లకు నివేదికలు అందించారు. పెద్దపల్లి-మంథని ప్రధాన రహదారి నుంచి మైసమ్మ టెంపుల్‌వరకు, మేనేజర్ కార్యాలయం నుంచి సైట్ కార్యాలయం వరకు తారు రోడ్డు మంజూరు చేసినట్లు మీడియ సెల్ ఇంచార్జ్ మేకల మారుతీ తెలిపారు. రోడ్డు మంజూరుకు కృషి చేసిన ఐఎన్‌టీయుసి జనక్‌ప్రసాద్, నర్సింహరెడ్డిలకు కోటరవీందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణి ఆసుపత్రిని తనిఖీ చేసిన జీఎం


వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, మే 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఏరియా ఆసుపత్రిని శుక్రవారం ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ తనిఖీచేశారు. ఆసుపత్రి క్యాజువాలిటీ వార్డును సందర్శించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందుల స్టోరేజీ, రోగులకు అందిస్తున్న మందుల వివరాలను తెలుసుకున్నారు. అవసరమైతే స్థానికంగా మందులను కొనుగోలు చేసి రోగులకు అందించాలని సూచించారు. డీవైసీఎంఓ అంబిక, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి ఉన్నారు.

అధికారుల సంఘం సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, మే 23(ఆంధ్రజ్యోతి): రామగుండం ఏరియా-2, 3 కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కాలనీలో సమావేశమయ్యారు. ఆర్జీ-2 ఏరియా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2022-23 పీఆర్పీ చెల్లింపుల్లో జాప్యం, ఉచిత విద్యుత్, ఐఐటీ, ఐఐఎంలో చదువుతున్న అధికారుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చించారు. పెండింగ్ సమస్యల పరిష్కారంలో జాప్యంపై అధికారులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. పెండింగ్ సమస్యలు సాధించుకునేందుకు నల్ల బ్యాడ్జిలు ధరించడం, రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని తీర్మానించారు. బీఈసీ జనరల్ సెక్రెటరీ పెద్ది నర్సింహులు, వైస్ ప్రెసిడెంట్ పీ శ్రీనివాస్‌తో పాటు ఆర్జీ-2, 3 ఏరియాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.